మీ గళం.. మా కలం...!

# నమస్తే హైదరాబాద్

www.namasthehyderabad.in

తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ విశేష ప్రజాధరణ పొందుతున్న నమస్తే హైదరాబాద్ తెలుగు దినపత్రికకు తెలంగాణ రాష్ట్రం లోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో విలేకరులు కావలెను

సీనియర్‌లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం

Ph: 9912580066

రంగా రెడ్డి సంపుటి : 13 సంచిక :206 ఎడిటర్: గొడిశాల సోమయ్య మంగళవారం 24-12-2024 పేజీలు :4 వెల : 2రూ

## అవకాశం ఇచ్చి ప్రోత్సహిస్తే వారు మారతారు..

# నేటి నుంచి ట్రాన్స్ జెండర్లు విధుల్లోకి..






నమస్తే హైదరాబాద్ : దేశంలో ఎక్కడా లేని విధంగా శిక్షణ ఇచ్చి ట్రాన్స్ జెండర్లకు ఉద్యోగాలు కల్పించిన తెలంగాణ ప్రభుత్వం. శారీరక మార్పుల కారణంగా ట్రాన్స్ జెండర్లను కుటుంబ సభ్యులు, సమాజం చిన్నచూపు చూస్తోంది.

దీంతో వారు కూడా మనుషులేనని.. వారికి తగిన అవకాశం కల్పిస్తే వారు కూడా ప్రతిభ చూపుతారని తెలంగాణ ప్రభుత్వం కొత్త అధ్యయనానికి శ్రీకారం చుట్టింది. దేశంలో ఎక్కడా లేని విధంగా ట్రాన్స్‌జెండర్లకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించామని, అంకిత భావంతో పనిచేస్తే రానున్న రోజుల్లో ఇతర శాఖల్లో ఉద్యోగాలు ఇచ్చే అవకాశం ఉంటుందని సిపి సివి ఆనంద్ అన్నారు. ఈ ప్రయోగం విజయవంతమైతే దేశంలోని వివిధ రాష్ట్రాలు కూడా ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలిస్తాయని చెబుతున్నారు. ఇప్పటి వరకూ ట్రాన్స్జెండర్లు పెళ్లిళ్లలో, దుకాణాల వద్ద డబ్బులు డిమాండ్ చేయడం, వ్యభిచారం చేయడం గమనించామని, వారికి సరైన అవకాశాలు లేకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి వచ్చిందన్నారు. గౌరవప్రదంగా సంపాదించుకునే అవకాశం కల్పిస్తే వారు మారుతారని భావించిన సీఎం రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. సమాజంలో వారు గౌరవ ప్రదంగా జీవించే విధంగా ప్రత్యేకంగా జీవో తెచ్చారని సిపి అన్నారు. ముందుగా ట్రాఫిక్ విభాగంలో హెూంగార్డు స్థాయిలో వీరి సేవలను వినియోగించుకుంటన్నామని చెప్పిన సిపి ఆనంద్ శిక్షణ పూర్తి చేసుకున్న ట్రాన్స్ జెండర్లను విధులు కేటాయించినట్లు తెలిపారు.

## మరో శుభవార్త చెప్పిన తెలంగాణ ప్రభుత్వం.. ఏంటంటే..




నమస్తే హైదరాబాద్ : హనుమకొండ : నవోదయ విద్యాలయాన్ని వంగరలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన చేశారు. భీమదేవరపల్లి మండలం వంగరలో పీవీ నరసింహారావు 20వ వర్ధంతి వేడుకలు ఇవాళ(సోమవారం) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, పీవీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... వారసత్వం లేకుండా నాటి రాజకీయాల్లో ఎదిగిన వ్యక్తి పీవీ నర్సింహారావు అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. భారతదేశానికి ఆర్థిక స్వాతంత్ర్యాన్ని తెచ్చిన వ్యక్తి పీవీ అని చెప్పారు. ఢిల్లీకి రాజైన తల్లికి కొడుకే అన్నట్లుగా.. ప్రధాని అయినా తన ఊరి గురించే ఎక్కువగా ఆలోచించిన వ్యక్తి పీవీ అని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తుచేశారు.

## 71 వేల మంది యువతకు జాబ్ లెటర్‌లు ఇచ్చిన ప్రధాని




నమస్తే హైదరాబాద్ : ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా కొత్తగా నియామకమైన 71,000 మందికి పైగా యువతకు అపాయింట్‌మెంట్ లెటర్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ప్రసంగిస్తూ కొత్తగా నియమితులైన వారిని అభినందించారు. ప్రధాని మాట్లాడుతూ భారతదేశ యువతతో మాట్లాండేందుకు తాను కువైట్ నుంచి రాత్రి భారత్ వచ్చానని పేర్కొన్నారు. ఇక్కడికి వచ్చిన తర్వాత దేశంలోని యువతతో తన మొదటి కార్యక్రమం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన వారి కుటుంబాలకు హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. భారతదేశ యువత సామర్థ్యాన్ని, ప్రతిభను పూర్తిగా వినియోగించుకోవడమే ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని ప్రధాని ఉద్ఘాటించారు.

## శ్యామ్ బెనగల్ ఇక లేరు




నమస్తే హైదరాబాద్ : ముంబయి, డిసెంబర్ 23: ప్రముఖ దర్శకుడు శ్యామ్ బెనగల్ కన్నుమూశారు. ఆయన వయస్సు 90 సంవత్సరాలు. గత కొంత కాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ముంబయిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ.. సోమవారం మృతి చెందారు. శ్యామ్ బెనగల్ మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు ధృవీకరించారు. ఈ రోజు సాయంత్రం 6.30 గంటలకు శ్యామ్ బెనగల్ మృతి చెందినట్లు ఆయన కుమార్తె పై బెనగల్ వెల్లడించారు. శ్యామ్ బెనగల్ దర్శకత్వంలో తెరకెక్కిన అనేక చిత్రాలకు అవార్డులు దక్కాయి. మమ్మో (1994) సర్దారీ బేగం (1996), జుబేదా (2001) తదితర చిత్రాలు ఆయన్ని చిత్ర సీమలో అగ్రభాగాన నిలిపాయి. అలాగే అంకూరు, నిషాంత్, మంథన్, భూమిక, జనూన్, మండి తదితర చిత్రాలు సైతం సంచలనం సృష్టించాయి. 1934, డిసెంబర్ 14వ తేదీన హైదరాబాద్‌లోని తిరుమలగిరిలో శ్యామ్ బెనగల్ జన్మించారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఆయన ఎంఏ చదివారు. పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులను సైతం ఆయన అందుకున్నారు. 2003లో ఇందిరాగాంధీ జాతీయ సమైక్యతా పురస్కారాన్ని అందుకున్నారు. దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు సైతం ఆయనను వరించింది. 2013లో ఏఎన్ఆర్ జాతీయ అవార్డును తీసుకున్నారు. మొత్తం ఏడుసార్లు శ్యామ్ బెనగల్ జాతీయ అవార్డు అందుకున్నారు.

## వారంలోగా మ్యాప్‌లు సమర్పించాలి..



నమస్తే హైదరాబాద్ : హైదరాబాద్: ఓఆర్ఆర్ సమీపంలో పలు చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్. చెరువులలో మట్టిపోయడం, వరద కాలువల్న కనిపించకుండా నిర్మాణాలు చేపట్టడం, తౌతాని కుంట, భగీరథమ్మ చెరువుకు వెళ్లే కాలువ లింకు తెగటంతో ఇళ్లలోకి నీరు చేరి ఇబ్బందులు పడుతున్నట్టు స్థానికులు ఫిర్యాదు చేయడంతో తనిఖీ చేపట్టారు. నానక్‌రామ్‌గూడకు సమీపంలోని తౌతానికుంట, భగీరథమ్మ చెరువు, నార్సింగిలోని నెక్నాంపూర్ చెరువులు ఆక్రమణకు గురవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా చెరువుల్లోకి వరద నీరు చేరకుండా కాలువలను మళ్లించడం, మూసివేయడంపై విచారణకు ఆదేశించారు.

చెరువులను పరిశీలించేందుకు వచ్చిన హైడ్రా కమిషనర్‌కు పలువులు స్థానికులు తమ సమస్యలు వినిపించారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ఖాళీస్థలం నుంచి వర్షపు నీరు వెళ్లే రహదారులు మూసుకుపోవడంతో సమీపంలో ఉన్న అపార్టుమెంట్‌లోకి వరద నీరు వచ్చి చేరుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు స్థానికులు. వరదనీరు తౌతాని కుంట ద్వారా భగీరథమ్మ చెరువుకు చేరేలా చేసి ఇబ్బంది తొలగించాలని విజ్ఞప్తి చేశారు. కొందరు చెరువులకు ఆనుకుని ఉన్న తమ స్థలాలను కాపాడాలని కోరగా.. పూర్తి వివరాలు హైడ్రాకు సమర్పిస్తే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్.

నానక్‌రామ్‌గూడకు సమీపంలోని వరదనీటి కాలువలపై ఉన్న అక్రమ నిర్మాణాలు, దుకాణాలు వెంటనే తొలగించాలని ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, నీటిపారుదల, జీహెచ్ఎంసీ(గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్), హెచ్ఎండీఏ (హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ) అధికారులను సంప్రదించి సమగ్ర నివేదిక సమర్పించాలని చెప్పారు. గ్రామీణ మ్యాప్‌లతో పాటు.. నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ, సర్వే ఆఫ్ ఇండియా, తెలంగాణ విభాగాలకు చెందిన మ్యాప్‌లతో పూర్తి స్థాయి పరిశీలన జరిపించి వారం రోజుల్లోగా నివేదిక సమర్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## రేవంత్ సీఎం కావడానికి కారణమిదే..



నమస్తే హైదరాబాద్ : వరంగల్ : మాజీ సీఎం కేసీఆర్ నిర్మించ తలపెట్టిన 24 అంతస్తుల ఎంజీఎం ఆస్పత్రిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి నిర్లక్షం చేసిందని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. 2023 అక్టోబర్ నెలలో ఎలా ఉందో ఇప్పుడు కూడా అదే పరిస్థితి..ఏమాత్రం పురోగతి లేదని అన్నారు. ఏడాది వ్యవధిలో 16 శాతం పనులు పూర్తి చేసే తీరికలేదని చెప్పారు. ఇవాళ(సోమవారం) వరంగల్‌లో హరీష్‌రావు పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ ఉనికి లేకుండా చేస్తానంటున్న రేవంత్ రెడ్డి ఆస్పత్రి నిర్మాణాన్ని ఆపారని మండిపడ్డారు. ఎంజీఎం ఆస్పత్రి నిర్వహణ పూర్తిగా ఫెయిల్ అయిందని చెప్పారు. యుద్ధప్రాతిపదికన ఆస్పత్రి నిర్మాణం పూర్తిచేయాలని.. లేకపోతే పోరాటాలు చేస్తామని అన్నారు. ఆస్పత్రి నిర్మాణ పనులను ఆపడం దద్దమ్మ పని అని విమర్శించారు. కోడిగుడ్డు మీద ఈకలు పీకడమే రేవంత్ రెడ్డి పని అని ఎద్దేవా చేశారు. ఆస్పత్రి నిర్మాణం ఆపడం ఎందుకని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌లో ఎంతోమంది సీనియర్లను తొక్కుకుంటూ వచ్చి సీఎం అయ్యారని హరీష్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్‌లో పుట్టి.. పెరిగిన నాయకులను తొక్కి సీఎం అయ్యాడని సంచలన ఆరోపణలు చేశారు. ఏ పార్టీలో ఉన్నా తొక్కుడు పదవులు పైన ఎక్కడం ఆయన నైజమని విమర్శించారు. ఎల్లకాలం ఇలాంటి సంస్కృతి సాగాదని హరీష్‌రావు హెచ్చరించారు. రేవంత్ క్రూరమృగాల మధ్య నుంచి వచ్చానని కిరాతకంగా వ్యవహారిస్తున్నారని ధ్వజమెత్తారు. పేదలను, రైతులను రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో 41 శాతం క్రైం రెట్ పెరిగిందని గుర్తుచేశారు. ఇది రేవంత్ రెడ్డి సాధించిన ప్రగతి అని విమర్శించారు. ప్రశ్నిస్తే కేసులు పెట్టడమే రేవంత్‌కు తెలిసిన పాలన అని హరీష్‌రావు విమర్శించారు.

# భారత్ విభూషణ్ అవార్డును అందుకున్న కొలకలూరి నవీన్ కుమార్



ఘట్కేసర్ డిసెంబరు 23 (నమస్తే హైదరాబాద్) మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని కొలకలూరి నవీన్ కుమార్ కి భారత్ విభూషణ్ అవార్డు అందుకోవడం జరిగింది. రవీంద్రభారతిలో శ్రీ వల్లూరి ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2024 సంవత్సరం భారత్ విభూషణ్ అవార్డును శ్రీ కొలకలూరి నవీన్ కుమార్ కు శ్రీ కోదండరాం ( ఎమ్మెల్సీ), శ్రీ డాక్టర్ రామకృష్ణ గౌడ్, (ఫిలిం ఛాంబర్ చైర్మన్) శ్రీ మాణిక్యరావు (ఫిలిం యాక్టర్) శ్రీ దైవాజ్ఞ శర్మ చేతుల మీదగా అవార్డు తీసుకోవడం జరిగింది. నవీన్ కుమార్ మాట్లాడుతూ ఈ అవార్డును తనకు ప్రకటించినందుకు డాక్టర్ వి ఆర్ శ్రీనివాస్ రాజు, కృష్ణవేణి, సుధాకర్ అన్న వారి టీం, సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

# కొర్రెముల ఏకశిలా నగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం..




పోచారం డిసెంబర్ 23 (నమస్తే హైదరాబాద్)మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్ మండల్, పోచారం మున్సిపల్ పరిధి లోని కొర్రెముల ఏకశిలా నగర్ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఏకశిలా నగర్ కొర్రెముల రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 739 నుండి 749 వరకు 14 ఎకరాల భూమిలో 1985లో వెంచర్ వేశారని, ఓ వ్యక్తి 2006లో తప్పుడు పత్రాలు సృష్టించి పాస్ బుక్కులు పొందారని ఆరోపించారు. అట్టి వాటిపై ఏకశిలా ఓనర్స్ అసోసియేషన్ కోర్టు కేసు వేసి గెలుపొందడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో ఏకశిలా నగర్ అసోసియేషన్ సభ్యులంతా తమ తమ ప్లాట్లలో ఇల్లు కట్టుకొని ఉండాలని తీర్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏకశిలా అసోసియేషన్ అధ్యక్షులు మాణిక్యాలరావు, కార్యవర్గ సభ్యులు శివారెడ్డి , సుభాష్ చంద్ర బోస్, ముత్త రెడ్డి వెంకటేష్ ,వెంకటేష్ నాయక్, సోమ్లా నాయక్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజావాణిలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ



నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి : హఫీజ్‌పేట్ లోని జలమండలి కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని, మంచి నీటి సరఫరా, యుజిడి నిర్వహణ పై జలమండలి అధికారులు , కార్పొరేటర్లు మంజుల రఘునాథ్ రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, జలమండలి అధికారులతో కలిసి పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఎసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ పలు కాలనీ వాసుల నుండి వచ్చిన వినతి పత్రాలను పరిగణనలోకి తీసుకొని అత్యవసర పనుల పై తక్షణమే స్పందించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఫిర్యాదు పై స్పందించాలని, ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని , ప్రజల నుండి వచ్చే ప్రతి అర్జీ పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు జీఎం నారాయణ , డిజిఎం వెంకటేశ్వర్లు , డిజిఎం శరత్ రెడ్డి, డిజిఎం నరేందర్ రెడ్డి, మేనేజర్లు సుబ్రమణ్యం , యాదయ్య, సందీప్ రెడ్డి, అభిషేక్ రెడ్డి, విక్రమ్ రెడ్డి, సునీత, రఘునాథ్ రెడ్డి, బాలింగ్ గౌతమ్ గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నిరసన కార్యక్రమాలు చేపట్టాలి. బస్కే నాగరాజు



కాజీపేట డిసెంబర్ 23 నమస్తే హైదరాబాద్ కేంద్ర హోంశాఖ మంత్రి భారత రాజ్యాంగ నిర్మాణ కర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నీ కించపరిచే విధంగా చేసిన వ్యాఖలకు నిరసనగా మంగళవారం నిర్వహించే నిరసన కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీఎస్పీ వరంగల్ జిల్లా అధ్యక్షులు బస్కే నాగరాజు అన్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమిత్ షా మాటలను తీవ్రంగా ఖండిస్తూ వెంటనే పదవి నుండి తొలగించాలని కోరుతూ బీఎస్పీ అధ్యక్షులు మాయావతి ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా అన్ని జిల్లాలలో మంగళవారం నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ ప్రకటనతో ప్రతి ఒక్కరు అంబేద్కర్ బొమ్మలతో కూడిన పార్టీ కండువా మెడలో ధరించి, నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ భాగస్వాములే అంబేద్కర్ ఆశయ సాధన కొరకు కృషి చేద్దాం అన్నారు,రాజ్యాంగాన్ని మార్చే కుట్రలో భాగంగా అంబేద్కర్ ని అవమాన పరుస్తూ మాట్లాడిన మనవాదులకు గుండెల్లో రైళ్లు పరుగెత్తిద్దామని తెలిపారు.

# రెడ్డి సంక్షేమ సంఘం కార్యవర్గం ఏకగ్రీవం



మాదిరెడ్డి రవీందర్ రెడ్డి



చాడ సునీల్ రెడ్డి

## అధ్యక్షులుగా మాదిరెడ్డి రవీందర్ రెడ్డి, కార్యదర్శిగా చాడ సునీల్ రెడ్డి

### జనవరి 5న నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ

హనుమకొండ, డిసెంబర్ 23 (నమస్తే హైదరాబాద్) రెడ్డి సంక్షేమ సంఘం వరంగల్ వారి కార్యవర్గం ఏకగ్రీవముగా ఎన్నిక జరిగినట్లు సంక్షేమ సంఘం అధ్యక్షులు మాదిరెడ్డి రవీందర్ రెడ్డి తెలియజేశారు. 2024-27 సంవత్సరములకు అధ్యక్షులు గా ప్రస్తుత అధ్యక్షులు మాదిరెడ్డి రవీందర్ రెడ్డి, కార్యదర్శి గా చాడ సునీల్ రెడ్డి, కోశాధికారి గా మెరుగు హనుమా రెడ్డి, ఉపాధ్యక్షులుగా కుందూరు కరుణాకర్ రెడ్డి, కాసర్ల వసుందర, చందుపట్ల సత్యనారాయణ రెడ్డి, సహ కార్యదర్శులుగా ముద్దసాని పద్మనాభ రెడ్డి, లెక్కల రజనీకాంత్ రెడ్డి ఎన్నికయినట్లు తెలిపారు. మొదటగా ప్రతి సంవత్సరం మూడవ వంతు నిర్వహించే డైరెక్టర్ల ఎన్నికలో డైరెక్టర్ లుగా విజయం సాధించిన మాదిరెడ్డి రవీందర్ రెడ్డి, కాసర్ల వసుందర, కుందూరు రమేష్ రెడ్డి, మాదాటి వీరా రెడ్డి, ముద్దసాని పద్మనాభ రెడ్డి, ఆలేటి నాగ రాజు రెడ్డి, మెరుగు హనుమా రెడ్డి, బొల్లం విజయపాల్ రెడ్డి, కటంగూరు రాంగోపాల్ రెడ్డి, కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి, చెరుకు రవీందర్ రెడ్డి, పున్నం రవీందర్ రెడ్డి, దుబ్బాక హేమ, వేణుగోపాల్ రెడ్డి లు డైరెక్టర్ లుగా ప్రమాణస్వీకారం చెసారు. ఈ సందర్భం గా అధ్యక్షులు రవీందర్ రెడ్డి, కార్యదర్శి సునీల్ రెడ్డి మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో రెడ్డి సంక్షేమ సంఘం పురోభివృద్ధికి పాటుపడుతామని తెలిపారు. జనవరి 5 ఆదివారం రోజున ఉదయం 10.30 లకు రెడ్డి సంక్షేమ సంఘం సర్వ సభ్య సమావేశం, నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ మడికొండ లోని రెడ్డి కన్వెన్షన్ సెంటర్ లో ఉంటుందని అందరు సకాలంలో విచ్చేయగలరని తెలియజేసారు.

# సమ సమాజ “మార్గ” నిర్దేశకులు, మాజీ ప్రధాని, భారతరత్న, కీ, శే పి.వి నరసింహారావు.

## 20 వ వర్ధంతి సందర్భంగా పూలమాలలతో ఘన నివాళి.

## టి వై జి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్, డాక్టర్ తనుగుల జితేందర్ రావు.

హైదరాబాద్( నమస్తే హైదరాబాద్ ):ఘన చరిత్రలో తానో భాగమై తనకోసం చరిత్రనే మలుచుకున్న ప్రజ్ఞాశీలి, అనుక్షణం వెలుగులుపంచే ధ్రువతారగా వెలుగుతూ ఉమ్మడి రాష్ట్రాల ప్రజల మనసుల్లోనే కాకుండా యావత్ భారతదేశ ప్రజలు చిరకాలం గుర్తుంచుకునే మహానేత మాజీ ప్రధాని, భారతరత్న కీ:శే పీ.వీ నరసింహారావు అని టీ వై జె ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ తణుగుల జితేందర్ రావు అన్నారు. సోమవారం పీ. వీ నరసింహారావు 20 వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్ లోని పీ. వీ ఘాట్ లో ఆయనకు ఘన నివాళులు అర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ముద్దు బిడ్డ మాజీ ప్రధాని, భారతరత్న, కీ, శే పి.వి నరసింహారావు సరళీకృత విధానాలతో ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించి, ప్రపంచీకరణ నేపథ్యంలో సంస్కరణలతో దేశానికి సరికొత్త మార్గాన్ని నిర్దేశించిన దార్శనికుడని స్మరించుకున్నారు. అప్పట్లో దేశం ఆర్థిక సంక్షోభం దిశగా వెళుతున్న పరిస్థితుల్లో ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి పీ. వీ నరసింహారావు చేసిన కృషి ఎనలేనిదని అన్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రాల ముద్దు బిడ్డగా కీర్తి గడించిన పీ. వీ



చరిత్రలో తన కోసం ఓ ప్రత్యేకతను ఏర్పరచుకున్న ఎంతో గొప్పవారు అని అన్నారు. భారతదేశ ప్రజల కోసం పీ. వీ కన్న కలలు నిజం కావాలని ఈ సందర్భంగా ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.అలానే పాల్గోన్న వారు టీఎస్ డ్రగ్ డైరెక్టర్ అమృత్ రావు.టి వై జే ఫ్ వైస్ ప్రెసిడెంట్ జీవన్ మరియు టి వై జే ఎఫ్ జిల్లా మండలాలా జర్నలిస్టులు ఘనంగా నివాళులు అర్పించారు.

# అమరరాజా బ్యాటరీస్ బిల్డింగ్‌లో అగ్నిప్రమాదం

శంషాబాద్ విమానాశ్రయంలో సోమవారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు, ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎయిర్‌పోర్టులోని నోవాటెల్ హోటల్ ఎదురుగా ఉన్న అమర రాజా బ్యాటరీస్ కంపెనీ బిల్డింగ్ నిర్మాణం జరుగుతోంది. నాలుగో అంతస్తులో వెల్డింగ్ మిషన్ కిందపడి ప్లైవుడ్‌కు మంటలంటుకున్నాయి. అప్రమత్తమైన సిబ్బంది ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మంటలార్పాయి. కాగా, ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరగలేదని ఎయిర్‌పోర్టు వర్గాలు పేర్కొన్నాయి. అగ్ని ప్రమాదంపై ఫిర్యాదేమీ రాలేదని ఆర్జీఐఏ పోలీసులు తెలిపారు.

# రైల్వే వంతెనలో ఇండ్లు కోల్పోయిన బాధితులకు న్యాయం చేస్తాం..

## మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్



ఘట్కేసర్ (నమస్తే హైదరాబాద్): ఘట్కేసర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం కీసర ఆర్డీవో సైదులు , టీపీసీసీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ,ఘట్కేసర్ మున్సిపల్ చైర్పర్సన్ పావని జంగయ్య గార్లు రైల్వే వంతెనలో ఇల్లు కోల్పోయిన బాధితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ఎలాంటి అపోహలకు పోకుండా ఎవరి కలబొల్లి మాటలు నమ్మకుండా రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వంలో బాధితులందరికీ న్యాయం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రైల్వే వంతెనకు అవసరమైన ఇళ్లను కూల్చివేతలో సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఐదు డిమాండ్లలో అన్నిటిని న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఇల్లు కోల్పోయిన నిరుపేదలకు స్థలముంటే ఇందిరమ్మ పథకంలో ఐదు లక్షలు వచ్చేలా చూస్తామన్నారు. లేనివారికి 60 గజాల స్థలం ఇందిరమ్మ గృహాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ సభ్యులు మేడ్చల్ బి బ్లాక్ కాంగ్రెస్ పార్టీఅధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్ ,ఘట్కేసర్ మున్సిపాలిటీ అధ్యక్షులు ముత్యాల యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# సందయ్య మెమోరియల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం: ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి : పేద విద్యార్థులకు సందయ్య చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయం అని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గం ఖాజా గూడా ప్రభుత్వ పాఠశాలలో సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రవి కుమార్ యాదవ్, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండ విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సందయ్య మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ పేద ప్రజలకు చేస్తున్న సేవలు అద్భుతమని అన్నారు. విద్యార్థులు తమకు లభించే సదుపాయాలను అందిపుచ్చుకుని పరీక్షల్లో ఉత్తీర్ణులు అయి తమ కుటుంబం, పాఠశాల, ప్రాంతానికి మంచి పేరు తేవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాజ్ కుమార్, చంద్రశేఖర్ రెడ్డి, నరేందర్ ముదిరాజ్, కృష్ణ, నరేందర్ యాదవ్, హనుమంతు నాయక్, శ్యామ్, రమేష్, అమర్ యాదవ్, సామ్రాట్ గౌడ్ , తిరుపతి, మల్లేష్ , రాజు, నిర్మల , భారతి, కల్పన పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత ..



దేవరుప్పుల (నమస్తే హైదరాబాద్) దేవరుప్పుల మండల విధ్యావనరుల కేంద్రంలో మెసింజర్ గా పని చేస్తున్న కామారెడ్డిగూడెం గ్రామానికి చెందిన మర్రిపెల్లి యాకయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసిన విషయం తెలిసిందే సోమవారం యాకయ్య దశదిన కర్మ సందర్భంగా ఆయన భార్య వాణి ,కూమారుడు,కూమార్తె లను మండల విద్యాధికారి గుంటిపల్లి కళావతి ,ప్రభుత్వ ఉపాధ్యాయులు మధ్యాహ్న సమయంలో పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు .అనంతరం సమిష్టి ఉపాధ్యాయుల సహకారంతో ఒక లక్ష ఇరవై రెండు వేయిల రెండు వందల రూపాయలను వారికి అందజేశారు.

అదేవిధంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా బాధ్యులు తాదూరి రమేష్ ఆధ్వర్యంలో మూప్పై ఐదువేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.

ఈ కార్యక్రమంలో, జిల్లా సైన్స్ అధికారి సిహెచ్ ఉపేందర్, కోలుకొండ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విష్ణు, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు అంబటి అంజయ్య,గోలి తిరుపతిరెడ్డి, జోగు వరప్రసాద రావు, శ్రీనివాస చారి, గోవర్ధన్ రెడ్డి, వాంకుడోత్ బికోజి,మాచర్ల ప్రభాకర్, బానోతు వెంకన్న,బాల నరసయ్య, వెంకన్న, కిరణ్,ఎండి కాజా నసీరుద్దీన్ ,మల్లేశం,సత్య నారాయణ, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా బాధ్యులు గోరంట్ల యాదగిరి, బాకీ వెంకటేశ్వర్లు, మార్గ నరసింహులు, గోలి రవీందర్ రెడ్డి, బుర్ర యాకస్వామి, జి రామచందర్ తదితరులు పాల్గొన్నారు .

# ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో....

# కొండాపూర్ లో ముగ్గుల పోటీలు



నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి : కొండాపూర్ లోని మహిళా కేంద్ర సహకార సంక్షేమం, కొమిరిశెట్టి ఫౌండేషన్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో శేరిలింగంపల్లి బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముగ్గుల పోటీలలో విజేతలుగా నిలిచిన మహిళలలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రామస్వామి యాదవ్, వరలక్ష్మి, ట్రెజరర్ చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

# బాప్టిస్ట్ చర్చ్ వెంకటాపురం లో క్రిస్మస్ వేడుకలు



పోచారం డిసెంబర్ 23 (నమస్తే హైదరాబాద్) మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండల్ పోచారం మున్సిపల్ పరిధిలోని వెంకటాపూర్ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఘట్కేసర్ మండల్ పాస్టర్స్ పాల్గొన్నారు.

అద్భుతమైన క్రిస్మస్ సందేశాన్ని రెవరెండ్ ఏసు రమేష్ చెప్పడం జరిగింది.

ఈ కార్యక్రమానికి రెవరెండ్ గంధం ఈవెన్స్ పాల్, మరియు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# సమాజంలో... వైద్య వృత్తి అత్యంత పవిత్రమైనది

- లక్ష్యసాధనలో విద్యార్థి దశ అత్యంత కీలకం
- గట్టి పునాదితో ముందుకెళ్తే ఏదైనా సాధించొచ్చు
- డాక్టర్ ఉమేష్ అక్కలదేవి






నమస్తే హైదరాబాద్ :
సమాజంలో వైద్య వృత్తి అత్యంత పవిత్రమైనదని, నిస్వార్థంతో రోగులకు సేవలందిస్తే గౌరవం గుర్తింపు దక్కుతుందని విశ్వ విశ్వాని డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ , రవి ఎల్లందుల లు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా క్షీరసాగర్ హంస మెడికల్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రసంగించారు. లక్ష్య సాధనలో విద్యార్థి దశ అత్యంత కీలకమైనదని, ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ముందుకెళ్తే సాధించనిదంటు ఏమి ఉ ఒడదని స్పష్టం చేశారు. అయితే వైద్య కోర్సులో గ్రాడ్యుయేషన్ డే పవిత్ర కార్యక్రమం కాగా, అద్భుత ప్రతిభ కనబరచి పూర్తి చేసిన వైద్య వృత్తికి వన్నె తేవాలని ఆకాంక్షించారు. ప్రణాళిక బద్ధంగా సేవలందిస్తూ భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరాలని, లాభాపేక్ష లేకుండా సేవాభావంతో రోగులకు వైద్య సేవలు అందించాలని చెప్పారు. అత్యున్నత ఆశయంతో కోర్సు పూర్తి చేసుకొని రోగులకు చక్కటి సేవలు అందిస్తే వృత్తికి సార్థకత చేకూరుతుందని, సంపన్న వర్గాలకే పరిమితమైన వైద్య వృత్తిని నేడు గ్రామీణ పేద విద్యార్థులను వైద్యులుగా తీర్చిదిద్దిన ఘనత హంస మెడికల్ కళాశాలకు దక్కుతుందని స్పష్టం చేశారు. సమాజంలో నెలకొన్న పరిస్థితుల వలన నేడు వైద్యరంగం వ్యాపారంగా మారిందని, అయితే ఆ అపవాదు నుండి గట్టేక్కించే బాధ్యతను యువ వైద్యులు స్వీకరించాలని అన్నారు. హంస మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఉమేష్ మాట్లాడుతూ 88 మంది వైద్య విద్యార్థులకు డాక్టర్ పట్టాలు అందజేయగా, భవిష్యత్తు పేరు ప్రఖ్యాతులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ పద్మజ, ప్రిన్సిపాల్ నూర్స్ షేహర్ ఖాన్, మెడికల్ సూపరి%శీ%డెంట్ కత్తి శ్రీనివాస బాబు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ.



దేవరుప్పుల( నమస్తే హైదరాబాద్): దేవరుప్పుల మండలంలోని సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు నేడు మధ్యాహ్నం 3 గంటలకు పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పాలకుర్తిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తారని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరాములు తెలిపారు. కావున, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు,మండల నాయకులు,అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకులు,యూత్ నాయకులు, సోషల్ మీడియా కో – ఆర్డినేటర్ లు, గ్రామ నాయకులు అందరూ నిర్ణీత సమయానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు కోరారు.

## సినిమా



# చిచ్చు కాదు.. కార్చిచ్చు..!



ఒక్క ఐడియా జీవితాన్ని మారుస్తుందో లేదోగానీ.. ఒక్క దుర్ఘటన ఇండస్ట్రీకి, ప్రభుత్వానికి మధ్య పెద్ద అగాధాన్నే సృష్టించింది. ఆడియో ఫంక్షన్లు, ప్రీ రిలీజ్ ఈవెంట్లను పండుగలా నిర్వహించే సినీ పరిశ్రమలో కార్చిచ్చులా రాజుకుంటోంది పుష్ప వివాదం. నాటోల్లీ టాలీవుడ్.. బాలీవుడ్ దాకా ఇప్పుడు అల్లు అర్జున్‌పై కేసు గురించే చర్చ. అరెస్టయ్యారు, రిమాండ్ అయ్యారు. బెయిలొచ్చినా ఓ రాత్రంతా జైల్లో ఉన్నారు. మ్యాటర్ ఇంతటితో క్లోజ్ అవుతుందనుకుంటే ఇప్పట్లో మంటలు చల్లారేలా కనిపించడంలేదు.

డిసెంబర్?4. చిక్కడపల్లి సంధ్య థియేటర్. పుష్ప టూ ప్రీమియర్ షోకు ఫ్యామిలీతో వచ్చారు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్. ఇసుకేస్తే రాలనంత జనసందోహం. హీరోని చూసేందుకు పోటెత్తారు అభిమానులు. కానీ అభిమానం ఓ నిండు ప్రాణం తీస్తుందని, మరొకరిని ప్రాణాపాయస్థితిలోకి నెట్టేస్తుందని ఊహించలేదెవరూ. తొక్కిసలాటలో రేవతి అనే మహిళ ప్రాణాలు కోల్పోయింది. తొమ్మిదేళ్ల ఆమె కుమారుడు శ్రీతేజ్ మూడువారాలుగా ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య చికిత్సపొందుతున్నాడు. తొక్కిసలాట ఘటనలో ఏ11గా అల్లు అర్జున్‌పై కేసు నమోదైంది. నాంపల్లి కోర్టు రెండువారాల రిమాండ్ విధించినా.. హైకోర్టు బెయిల్ మంజూరుచేయడంతో రిలీజయ్యారు అల్లు అర్జున్. కానీ ఫార్మాలిటీస్ ఆలస్యం కావటంతో ఓ రాత్రంతా ఆయన చంచలగూడ జైల్లోనే గడపాల్సి వచ్చింది.అల్లు అర్జున్ అరెస్ట్‌పై సెలబ్రిటీలంతా స్పందించారు. జైలునుంచి ఇంటికి చేరగానే అల్లు ఇంటికి టాలీవుడ్ ప్రముఖులు క్యూ కట్టారు. బాలీవుడ్ తారలు కూడా అల్లు అర్జున్ అరెస్ట్‌ని తప్పుబట్టారు. బీఆర్ఎస్, బీజేపీ అల్లు అర్జున్ అరెస్ట్‌ని తప్పుపట్టాయి. నేషనల్ అవార్డ్ విన్నర్‌ని ఓ క్రిమినల్‌లా అరెస్ట్ చేశారని విమర్శించాయి. మహిళ మృతిపై విచారం వ్యక్తంచేస్తూనే ఆ తొక్కిసలాటకు తాను కారణం కాదన్నారు అల్లు అర్జున్. మృతురాలి కుటుంబానికి 25లక్షల పరిహారం ప్రకటించారు. అల్లు అర్జున్‌ని సినీ ఇండస్ట్రీతో పాటు విపక్షాల సంఘీభావంతో.. అసెంబ్లీలో తొక్కిసలాట ఘటనపై ప్రభుత్వం ప్రకటన చేసింది. అల్లు అర్జున్‌పై అసెంబ్లీలో తీవ్రస్థాయిలో స్పందించారు సీఎం రేవంత్‌రెడ్డి.

అల్లు అర్జున్ అరెస్ట్ తొందరపాటు చర్యని బీజేపీ, బీఆర్ఎస్ తప్పుపడితే.. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ చర్యని సమర్థించింది మజ్లిస్‌పార్టీ. చట్టానికి ఎవరూ అతీతులు కారని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ప్రభుత్వాన్ని వెనకేసుకొచ్చారు. తొక్కిసలాట ఘటన చివరికి సిన్మా ఇండస్ట్రీపై చర్చగా మారిపోయింది. సినీ ఇండస్ట్రీకి మినహాయింపు విషయంలో ఇక కచ్చితంగా వ్యవహరించాలన్న ప్రభుత్వ నిర్ణయంతో చిత్రపరిశ్రమ ఉలిక్కిపడింది. అల్లు అర్జున్‌కి సినీ ప్రముఖులంతా మద్దతు పలకటంతో సర్కారు కూడా తొక్కిసలాట ఘటనని సీరియస్‌గా తీసుకుంది. ఓరాత్రంతా జైల్లో గడిపివచ్చాక ఆచితూచి స్పందించారు అల్లు అర్జున్. జరిగిన ఘటన దురదృష్టకరమని, తాను చట్టాన్ని గౌరవిస్తానని చెప్పుకొచ్చారు. అయితే ఎప్పుడైతే తనపై అసెంబ్లీలో చర్చ జరిగిందో మరోసారి మీడియాముందుకొచ్చారు పుష్పరాజ్. తన క్యారెక్టర్‌ని డ్యామేజ్ చేసే ప్రయత్నం జరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. తానెలాంటి రోడ్‌షోలు చేయలేదని, తొక్కిసలాట జరిగినట్లు కూడా తన దృష్టికి రాలేదని చెప్పుకొచ్చారు. అల్లు అర్జున్ వివరణ తమను నిందించేలా ఉండటంతో పోలీసులు యాక్షన్‌లోకి దిగారు. అనుమతి లేకున్నా అల్లు అర్జున్ థియేటర్‌కొచ్చి తొక్కిసలాటకు కారణమయ్యారని సీసీ ఫుటేజ్, ఇతర వీడియోలను బయటపెట్టారు. అల్లు అర్జున్ టీంతో పాటు థియేటర్ సిబ్బంది సహకరించలేదని కేసులో కొత్త ట్విస్టులు తెరపైకొచ్చాయి. డిసెంబర్? 4న సంధ్య థియేటర్‌కి అల్లు అర్జున్? వచ్చినప్పుడు బయట, లోపల ఏం జరిగిందో మినిట్? టు మినిట్?.. పిన్? టు పిన్? వీడియో ఎవిడెన్స్ రిలీజ్ చేశారు పోలీసులు. రాత్రి 9.15 నుంచి అర్ధరాత్రి 12గంటల 5 నిమిషాలదాకా అక్కడేం జరిగిందో.. రీల్ టూ రీల్ పుష్ప త్రీ చూపించారు.

# ఈ నీరు అమృతం కన్నా పవర్‌ఫుల్..



ప్రస్తుత కాలంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.. వాటికి చెక్ పెట్టేందుకు మంచి జీవనశైలిని అనుసరించడం, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినడం చాలా ముఖ్యం.. అలాంటి ఆహార పదార్థాలలో మెంతులు ఒకటి.. మెంతులను మసాలా దినుసుగా.. భారతీయ గృహాలలో విస్తృతంగా ఉపయోగిస్తారు.. మెంతులతోపాటు.. ప్రజలు మెంతికూరను కొన్నిసార్లు కూరగాయలలో, కొన్నిసార్లు పరాటాలలో కలిపి తింటారు.. ఇంకా మెంతులతో లడ్డూలు కూడా తయారు చేసుకుని తింటారు.. అయితే.. మెంతులు వల్ల కలిగే ప్రయోజనాల గురించి మనలోని కొంత మందికి చాలా తక్కువ తెలుసు. ఆయుర్వేద నిపుణుల అభిప్రాయం ప్రకారం, మెంతులు అనేక రకాల విటమిన్లు, ఖనిజాలను కలిగి ఉంటాయి.. ఇవి శరీరానికి చాలా ఉ పయోగకరంగా ఉండటంతోపాటు.. మేలు చేస్తాయి.ఆయుర్వేద నిపుణుల ప్రకారం.. మెంతులు, మెంతికూర సహాయంతో మనం అనేక రకాల వ్యాధులను నయం చేయవచ్చు. మెంతులలో ప్రోటీన్, టోటల్ లిపిడ్, ఎనర్జీ, ఫైబర్, కాల్షియం, ఐరన్, ఫాస్పరస్, పొటాషియం, జింక్, మాంగనీస్, విటమిన్ సి, విటమిన్ బి, సోడియం, కార్బోహైడ్రేట్లు వంటి పోషకాలు ఉంటాయి.

కాబట్టి మెంతి నీరు త్రాగడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటి..? దానిని ఎప్పుడు తాగాలో తెలుసుకోండి..ఖాళీ కడుపుతో మెంతి నీరు త్రాగడం వల్ల కలిగే ప్రయోజనాలు..

శరీరాన్ని డిటాక్సిఫై చేస్తుంది: మెంతి నీరు శరీరాన్ని నిర్విషీకరణ చేస్తుంది. ఈ నీటిని తాగడం వల్ల శరీరంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. రోజూ ఉదయాన్నే మెంతికూర నీరు తాగడం వల్ల శరీరం ఆరోగ్యంగా ఉంటుంది.

జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది: జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడానికి మెంతి నీరు దివ్యౌషధంలా పనిచేస్తుంది. ఇది పొట్టను శుభ్రపరుస్తుంది. ఈ నీటిని తాగడం వల్ల మలబద్ధకం, అసిడిటీ, కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం లభిస్తుంది.

బరువు తగ్గడంలో ప్రభావవంతంగా ఉంటుంది: మెంతులు బరువు తగ్గడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయి. నిత్యం మెంతికూర, మెంతి నీళ్లు తాగితే ఊబకాయం త్వరగా తగ్గుతుంది. దీని కోసం ఈ మెంతులను బాగా నమలి తినండి.. దీని ప్రభావం త్వరలోనే కనిపిస్తుంది.

ఆయుర్వేద నిపుణుల అభిప్రాయం ప్రకారం..

మెంతి గింజల నీరు ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. డయాబెటిస్ లో కూడా మేలు చేస్తుంది. ముఖ్యంగా మీరు దీన్ని ఉదయం ఖాళీ కడుపుతో తాగితే చాలా మంచిది.. మెంతి నీటిని తయారు చేయడానికి ఒక గ్లాసు నీటిలో ఒకటి నుంచి ఒకటిన్నర టీస్పూన్ మెంతి గింజలను రాత్రంతా నానబెట్టండి. ఉదయం నిద్ర లేవగానే ఈ నీటిని బాగా వడపోసి ఖాళీ కడుపుతో తాగాలి. కావాలనుకుంటే మెంతి గింజలను తర్వాత తినవచ్చు.

ఉదయాన్నే ఖాళీ కడుపుతో మెంతి నీరు తాగడం వల్ల శరీరంలోని టాక్సిన్స్ బయటకు వెళ్లిపోతాయి. మెంతులు వేడిగా ఉంటాయి.. కాబట్టి గర్భిణీ స్త్రీలు వైద్య సలహా మీద మాత్రమే దానిని తీసుకోవాలి..

# ఇందులో ఇన్వెస్ట్ చేస్తే కోటి రూపాయలు మీ సొంతం..




చాలా మంది లక్షాధికారులు కావాలని కలలు కంటుంటారు. కానీ అది అందరికి సాధ్య కాకపోవచ్చు. సరైన ప్రణాళికతో ముందుకు సాగితే ఎవరికైనా సాధ్యమవుతుంది. మీరు మీ భవిష్యత్తును సురక్షితంగా ఉంచుకుని, లక్షాధికారి కావాలని కలలుకంటున్నట్లయితే, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (%ఔాఖీ%) మీకు ఆప్షన్. పీపీఎఫ్‌లో ఎక్కువ కాలం ఇన్వెస్ట్ చేయడం ద్వారా 25 ఏళ్లలో కోటి రూపాయలకు పైగా ఫండ్‌ను నిర్మించుకోవచ్చు. ఈ స్కీమ్ బ్యాంకుల్లో, పోస్టాఫీసుల్లో అందుబాటులో ఉంది.మీరు పీపీఎఫ్ ఖాతాలో నెలకు రూ.12,500 డిపాజిట్ చేసి, 15 ఏళ్లపాటు నిరంతరంగా ఇన్వెస్ట్ చేస్తే, మెచ్యూరిటీ సమయంలో మొత్తం రూ.40.68 లక్షలు పొందుతారు. ఇందులో మీ మొత్తం పెట్టుబడి రూ. 22.50 లక్షలు, మీరు వడ్డీగా రూ. 18.18 లక్షల అదనపు ఆదాయాన్ని పొందుతారు. ఇది 7.1% వార్షిక వడ్డీ రేటు ఆధారంగా లెక్కిస్తారు. ప్రభుత్వం ప్రతి త్రైమాసికంలో పీపీఎఫ్‌లో వడ్డీ రేటును సవరిస్తుంది. దీని కారణంగా మెచ్యూరిటీ మొత్తం మారవచ్చు.మీరు పీపీఎఫ్ ద్వారా మిలియనీర్ కావాలనుకుంటే మీరు 15 సంవత్సరాల తర్వాత ప్రతి 5 సంవత్సరాలకు రెండుసార్లు మీ ఖాతాను పెంచుకోవాలి. అంటే మీ పెట్టుబడి కాలం 25 సంవత్సరాలు. ఈ కాలంలో మీ మొత్తం పెట్టుబడి రూ. 37.50 లక్షలు. అలాగే మీ వడ్డీ ఆదాయం రూ. 65.58 లక్షలు. ఈ విధంగా మీరు 25 సంవత్సరాలలో మొత్తం 1.03 కోట్ల రూపాయలు పొందుతారు. కానీ మీరు మీ %ఔాఖీ% ఖాతాను 15 సంవత్సరాల తర్వాత పొడిగించాలనుకుంటే మీరు మెచ్యూరిటీకి ఒక సంవత్సరం ముందు దరఖాస్తు చేసుకోవాలని గుర్తుంచుకోండి. మీరు సకాలంలో ఖాతా పొడిగింపును అభ్యర్థించకపోతే అది పొడిగించరు.

# సన్‌రైజర్స్ ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్..





టీమిండియాలో రీ ఎంట్రీ కోసం వికెట్ కీపర్, బ్యాట్స్‌మెన్ ఇషాన్ కిషన్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. దక్షిణాఫ్రికా పర్యటనను అర్ధాంతరంగా వదిలేసినప్పటి నుంచి భారత జట్టులో చోటు దక్కించుకోలేదు. మరోవైపు రీ ఎంట్రీ కోసం దేశవాళీ క్రికెట్ ఆడాలని బీసీసీఐ జట్టుకు సూచించింది. ఐతే ఇషాన్ కిషన్ గత కొన్ని నెలలుగా దేశవాళీ క్రికెట్ ఆడుతున్నాడు. ప్రస్తుతం దేశంలో విజయ్ హజారే పోటీ కొనసాగుతోంది. విజయ్ హజారే టోర్నమెంట్ 50 ఓవర్లు ఉంటుంది. ఈ టోర్నమెంట్‌లో అద్భుత ప్రదర్శన చేసే ఆటగాళ్లను ఛాంపియన్స్ ట్రోఫీకి పరిగణించే అవకాశం ఉంది. జార?ండ్‌కు ఆడుతున్నా ఇషాన్ దూకుడు ఇన్నింగ్స్‌తో సెంచరీ చేశాడు. ఇషాన్ కిషన్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తూ బ్యాటింగ్‌కు నాయకత్వం వహిస్తున్నాడు. ఇషాన్ 78 బంతుల్లో 134 పరుగులతో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. 16 ఫోర్లు, 6 సిక్సర్లు బాదాడు. అతని స్ట్రైక్ రేట్ 171కి పైగా ఉంది.ఇషాన్ కిషన్ చివరిసారిగా 2023 అక్టోబర్‌లో వన్డే ఆడాడు. ఈ మ్యాచ్ ఢిల్లీలో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగింది. అప్పటి నుంచి ఇషాన్ కిషన్‌ను జట్టులోకి తీసుకోలేదు. అంతేకాదు కేంద్ర కాంట్రాక్టు జాబితా నుంచి కూడా ఆయనను తొలగించారు. కాగా, దేశవాళీ క్రికెట్‌లో ఇషాన్ కిషన్ తన సత్తా చాటాడు. కాబట్టి ఛాంపియన్స్ ట్రోఫీకి అతని పేరు చర్చకు వస్తుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే ఇషాన్‌ను ఎంపిక చేస్తారో తెలియాల్సి ఉంది.

ఛాంపియన్స్ ట్రోఫీకి దాదాపు నెలన్నర సమయం ఉంది. హైబ్రిడ్ మోడల్‌లో పోటీ నిర్వహించనున్నారు. అలాగే భారత్ మ్యాచ్‌లు దుబాయ్‌లో జరగనున్నాయి. ఫిబ్రవరిలో జరగనున్న ఈ టోర్నీకి టీమిండియా జట్టును ఇంకా ప్రకటించలేదు. అయితే కొంతమంది ఆటగాళ్ల ప్రదర్శనపై సెలక్షన్ కమిటీ కన్ను వేసింది. మిగిలిన విజయ్ హజారే ట్రోఫీలో ఇషాన్ కిషన్ పెద్ద నాక్ లేదా రెండు ఆడితే, అతని పేరును పరిశీలించవచ్చు. అదే సమయంలో అతను ఐపీఎల్ 2025లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడనున్నాడు.

Printed published and owned by Godishala Somaiah published from # 15-76,Medipally, Ghatkesar,Ranga reddy,Dist,Printed at Sri SehaSai Printers,IDA BalaNagar, Hyderabad,Editor : Godishala Somaiah,email:nhnews24@gmail.com,ph 9912580066,RNI APTEL/2012/45237..